# ఆకలి

## లిఖిత్

విజయపురి రాజ్యానికి మహారాజు శూరసేనుడు. అతను మంచివాడే కాని మూర్ఖుడు. ప్రజల క్షేమాలను పట్టించుకునేవాడు కాదు. రాజుని అడ్డం పెట్టుకుని సేనాధిపతి అనేక అరాచకాలు చేసేవాడు. ప్రజలతో బలవంతంగా పన్నులు వసూలు చేసేవాడు. పన్ను కట్టనివారి శిక్షలు తీవ్రంగా వుండేవి. రాజ్యమంతటా కరువు. తినడానికి తిండి లేదు. అయినా రాజుగారి భోగాలకు అంతేలేదు. ప్రజలు మలమల మాడుతూ ఆకలికి పిట్టల్లా రాలిపోయేవారు. ఏ దేవుడైనా వచ్చి తమను కాపాడతాడని ఆశతో ఎదురుచూసేవాళ్లు.

ఒకరోజు నగరంలోకి ఒక సన్యాసి ప్రవేశించాడు. అతని వెంట ఒక కుక్క కూడా వుంది. ఆ కుక్క అతనికంటే ఎత్తుగా వుంది. అది ఠీవిగా నడుస్తూ వుంటే నగరంలోని వూరకుక్కలన్నీ కాసేపు మొరిగి పారిపోయాయి. ఆ కుక్క కళ్లు రౌద్రంగా వున్నాయి. నగరంలోని ప్రజలంతా విస్తుపోయి వీధుల్లోకి వచ్చి ఈ దృశ్యాన్ని చూశారు. నగరానికి ఏదో కీడు దాపురించిందని భయపడ్డారు.

సన్యాసి నేరుగా రాజభవనం ముందు నిల బడ్డాడు. సన్యాసి కనుసైగ చేయగానే కుక్క మొరగడం ప్రారంభించింది. ఆ శబ్దం ఎంత భయంకరంగా వుందంటే నగరంపైన పిడుగులు పడ్డాయేమో అని అందరూ భావించారు. భూకంపం వచ్చినట్టుగా అందరూ వణికిపోయారు.

ఆ శబ్దానికి జడుసుకున్న సైనికులు సన్యాసి దగ్గరికొచ్చి ఆ కుక్కని అరవకుండా చూడమని ప్రాధేయపడుతూ ''నీకేం కావాలి'' అని అడిగారు.

''నా కుక్కకి ఆకలిగా వుంది'' అన్నాడు సన్యాసి.

వెంటనే కుక్కకి ఆహారం వచ్చింది. దాన్ని మొత్తం తినేసింది కుక్క. తిన్నంతసేపు అది మొరగలేదు. నగర ప్రజలంతా వూపిరి పీల్చుకున్నారు. తిన్న వెంటనే మళ్లీ కుక్క మొరగడం ప్రారంభించింది.

ఈసారి ఇంకా ఎక్కువ ఆహారం తెచ్చిపెట్టారు.

తిన్న తరువాత మళ్లీ మొరుగుడు.

కోటలో సైనికుల కోసం వండిన తిండి మొత్తం తెచ్చి పెట్టారు.

తిన్న వెంటనే మళ్లీ మొరుగుడు. ఆ భయంకర శబ్దానికి ఈసారి రాజు శూరసేనుడు బయటికి వచ్చాడు. అప్పటి వరకూ అతను ఎంతగా విలాసాల్లో మునిగివున్నాడంటే, నగరానికంతా వినిపించిన కుక్క మొరుగుడు అతని చెవులను కూడా తాకలేదు.

సన్యాసిని చూసిన రాజు కోపంతో ''ఏమిటిది? ముందు ఆ కుక్క నోరు మూయించండి'' అన్నాడు.

''ఆకలిగా వున్నంతసేపు అది అలా అరుస్తూనే వుంటుంది'' అన్నాడు సన్యాసి.

రాజు సైనికులకు సైగ చేశాడు.

కోటలోని మొత్తం ఆహార పదార్థాలు వచ్చాయి. కొన్ని క్షణాల్లో ఆ తిండి మొత్తాన్ని కుక్క తినేసింది.

''హమ్మయ్య ఇక అరవదులే'' అని అందరూ గుండెలమీద చెయ్యి వేసుకున్నారు. మరుక్షణంలోనే మొరగడం ప్రారంభించింది కుక్క.

రాజుగారికి ఆశ్చర్యమేసి ''కోటలోని తిండి మొత్తం తినేసినా దీని ఆకలి తీరలేదేమయ్యా'' అని అడిగాడు సన్యాసిని.

''మహారాజా, దీని ఆకలి అంత సులభంగా తీరదు. ఈ రాజ్యంలోని ప్రజలు ఆకలిగా వున్నంతకాలమూ, ఈ జాగిలం ఆకలితో అలా అరుస్తూనే వుంటుంది'' అన్నాడు సన్యాసి.

మహారాజుకి సన్యాసి మాటల్లోని అంతరార్థం బోధపడింది. కోటలోని విందులు వినోదాలు ఆగిపోయాయి. ప్రజల కష్టసుఖాలు అతని చెవులకు సోకాయి. కుక్కతో పాటు సన్యాసి కూడా మళ్లెప్పుడూ ఆ రాజ్యంలో కనబడలేదు.

